సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



అరసవల్లికి భక్తుల తాకిడి

ఆదిత్యాలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి మొక్కులు చెల్లించారు.

- 8లో



భారీగా చేరికలు

వైఎస్సార్‌సీపీలో చేరికలు భారీగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ విధానాలకు ఆకర్షితులవుతున్నారు.

- 8లో

రూ. 1,04,500 పట్టివేత

పొందూరు: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రాపాక కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఆదివారం ఎఫ్‌ఎస్‌టీ టీమ్ చేపట్టిన తనిఖీల్లో రూ. 1,04,500లను పట్టుకున్నట్లు తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్ తెలిపారు. రాజాంకు చెందిన వెంకటరావు వైజాగ్ వెళుతుండగా రాపాక కూడలిలో తనిఖీ చేశారు. దీంతో ఆయన వద్ద ఆధారాలు లేని ఈ నగదు దొరికింది. నగదును సీజ్ చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. తనిఖీల్లో డీటీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఒడిశా మద్యం బాటిళ్ల పట్టివేత



ఎస్‌ఈబీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న ఒడిశా మద్యం బాటిళ్లు

ఇచ్ఛాపురం: ఒడిశాకు చెందిన 50 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎస్‌ఈబీ ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు. ఎస్‌ఈబీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. అడిషనల్ ఎస్పీ ఎస్‌ఈబీ డి.గంగాధరం ఆదేశాల మేరకు ఎస్‌ఐ పి.నరేంద్రకుమార్, బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది మండలంలోని అరకపద్ర గ్రామంలో ఆదివారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ మేరకు కుమ్మరివీధి వెనుక గల జీడితోటల్లో ఒడిశాకి చెందిన 50 మద్యం సీసాలతో ఓ మహిళ పట్టుబడింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో కూర్మినాయుడు, ఎన్‌టినాయుడు పాల్గొన్నారు.

'ఎన్నికల వ్యయం నమోదు చేయండి'



ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో మాట్లాడుతున్న అధికారి కేకే శ్రవణ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు కచ్చితంగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలక అధికారి కేకే శ్రవణ్ కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. సహాయక వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్, అకౌంటింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోదం, ఆమోద యోగ్యం కాని ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని సూచించారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోలో అన్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీమ్ సభ్యులు రికార్డింగ్ చేసి పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీమ్ సభ్యులకు అందజేయాలని, అకౌంటింగ్ టీమ్ సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రిటర్నింగ్ కార్యాలయం నుంచి ఎన్ని పర్మిషన్లు ఇచ్చారు, వాటి ఖర్చుల వివరాలను అడిగి రిజిస్టర్లను తనిఖీ చేశారు. వార్తా పత్రికల్లో పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురిస్తే వాటిపై దృష్టి సారించాలని, ఫిర్యాదు వస్తే ఎలా పరిష్కరిస్తారన్న అంశంపై సంబంధిత అధికారులతో చర్చించారు.

మాటపై గౌరవం.. మనిషిపై నమ్మకం

చెప్పారంటే... చేస్తారంతే

అమ్మ ఒడి పెంపుపై ఆనందం.. రైతు భరోసా సాయం పెంచడంపై సంతోషం.. సంక్షేమ పథకాల కొనసాగింపుపై సంతృప్తి.. అన్నింటికీ మించి సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీపై కొండంత విశ్వాసం. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో జనం మనసులను తాకుతోంది. సీఎం మాటపై గౌరవం, ఆయనపై పెంచుకున్న నమ్మకం ప్రజా స్పందనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. విపక్షాలు ప్రకటించిన మేనిఫెస్టోకు ఏ మాత్రం విశ్వసనీయత లేదని, వైఎస్ జగన్ ఓ సారి మాట ఇస్తే కచ్చితంగా నిలబెట్టుకుంటారని అంటున్నారు.

ఉత్సాహం రెట్టింపైంది..



జగనన్న మేనిఫెస్టోతో మా ఉత్సాహం రెట్టింపైంది. జగనన్న చెబితే చేస్తాడు. ఆయన సీఎం అయ్యాక మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. మాకు రైతుభరోసా వస్తోంది. నా కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. విద్యా దీవెన వచ్చింది. మాకు ఇళ్ల పట్టా ఇచ్చారు. ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. ఇంకేం కావాలి. చంద్రబాబు అబద్ధపు హామీలు మేము నమ్మబోము. జగన్ అంటేనే మా నమ్మకం.
– బంకి సవరమ్మ, దీనబంధుపురం గ్రామం,మెళియాపుట్టి

వైఎస్ జగన్ రైతు పక్షపాతి



చంద్రబాబు ఇచ్చిన హామీలపై మాకు నమ్మకం లేదు. వైఎస్ జగన్ మాట ఇస్తే నిలబెట్టుకుంటారు. రైతు భరోసా పెంచుతామని ప్రకటించడం ఆనందంగా ఉంది. పంటకు పెట్టుబడి అదనంగా అందుతుంది. – రౌతు ధర్మారావు, రైతు, మెట్టూరు బిట్–1, కొత్తూరు మండలం

పిల్లల భవిష్యత్‌కు భరోసా



ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామం మాది. మట్టి కుండలు చేసుకుంటూ, వాటిని ఊరూరా అమ్ముకుంటే గానీ పట్టెడన్నం లభించదు. జగనన్న అమ్మ ఒడి పెంచుతామని ప్రకటించారు. మాలాంటి వారికి ఇది ఎంతో సాయంగా ఉంటుంది. జగనన్న మేనిఫెస్టో అంటేనే మాలాంటి నిరుపేదలకు ఓ భరోసా.
– తుంబలో బెహరా, అరకబద్ర, ఇచ్ఛాపురం

జగనన్నపై నమ్మకం ఉంది



అమ్మ ఒడి పెంచుతామని జగనన్న ప్రకటించారు. ఆయన మాటపై మాకు నమ్మకం ఉంది. 2019లో చెప్పినట్టుగానే మాకు అమ్మ ఒడి ఇచ్చారు. అమ్మ ఒడితో మాలాంటి పేదల పిల్లలకు చదువుల ఖర్చు తగ్గుతోంది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై మాకు నమ్మకం లేదు.
– బొమ్మాళి హేమలత, కొత్తూరు

రుణపడి ఉంటాం..



గత నాలుగేళ్లుగా ఏటా రూ.18,750 ప్రభుత్వం నుంచి అందుకున్నాను. మరో నాలుగేళ్లు కూడా ఈ సాయం అందిస్తానని జగనన్న మేనిఫెస్టోలో చెప్పారు. ఇలాంటి ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం. నా కొడుకు పోయిన లోటును ముఖ్యమంత్రి తీరుస్తున్నారు. – తోట తులసమ్మ, పాలవలస, సోంపేట మండలం

మోటారు డోలీలు వచ్చే.. మోత కష్టాలు పోయే..



డోలీల్లో గర్భిణుల రోదనలు విని కొండ గుండెలు అవిసిపోయాయి. అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేరలేక గిరి పుత్రుల అవస్థలు చూసి అడవి దారులు అలసిపోయాయి. దశాబ్దాలుగా సాగిన ఈ శోకానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరమ గీతం పాడింది. నేడు ఆ గిరి శిఖరాల్లో కుయ్‌కుయ్‌మంటూ అంబులెన్స్‌ల శబ్దం వినిపిస్తోంది. కాబోయే అమ్మలకు ధైర్యమిస్తూ కావాల్సినప్పుడల్లా ఫీడర్ అంబులెన్స్ వాహనం ఊరి గడపలో వచ్చి వాలుతోంది. ఫస్ట్ రెస్పాండ్ వెహికిల్‌గా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ వాహనం సంజీవనిగా మారింది.

ఎత్తైన గిరిశిఖర గ్రామమైన చందనగిరి నుంచి గర్భిణిని తీసుకెళ్తున్న ఫీడర్ అంబులెన్స్

- గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఫీడర్ అంబులెన్స్‌లు
- అత్యవసర వేళల్లో ఆస్పత్రులకు చేర్చుతున్న వాహనాలు
- గిరిజన ప్రాంతాల్లో గర్భిణులకు నిరుపమాన సేవలు
- వేల మంది ప్రాణాలు కాపాడిన ఈఎంటీలు

అభివృద్ధి పథం సంక్షేమ రథం

మెళియాపుట్టి:

ఫస్ట్ రెస్పాండ్ వెహికల్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫీడర్ అంబులెన్స్‌లు గిరిజన ప్రాంతాల్లో నిరుపమాన సేవలు అందిస్తున్నాయి. ఎత్తయిన గిరి గ్రామాల ప్రజలకు అత్యవసర వేళల్లో ఈ వాహనాలే అక్కరకు వస్తున్నాయి. మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల్లోని 372 గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్ సేవలు అందుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఫీడర్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. పేరుకు ఇది ఫీడర్ అంబులెన్స్ అయినా దీంట్లో ఆక్సిజన్ కిట్, నెబ్యులైజేషన్ పరికరం, పల్స్ ఆక్సీమీటర్, బీపీ చెకర్, అత్యవసర సమయాల్లో అందించాల్సిన మందులు అన్నీ అందుబాటులో ఉంటాయి.

ఈఎంటీలకు ప్రావీణ్యత..

అంబులెన్స్ పైలెట్‌గా ఉండే ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ముందుగానే సీపీఆర్‌లో ప్రావీణ్యం పొంది, అత్యవసర సమయాల్లో చేయాల్సిన చికిత్సపై అవగాహన కలిగి ఉంటారు. అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటూనే వారు బాధితులను ఆస్పత్రులకు తీసుకొస్తారు. అందుబాటులో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ లేకపోయినా 108కు సమాచారం అందించి.. వాహనం దగ్గరకు చేర్చుతారు. ఇలా గిరిజనులు, మారుమూల ప్రాంతాల ప్రజల ప్రాణాలు కాపాడటానికి ఈ ఫీడర్ అంబులెన్స్‌లు సంజీవనిలా ఉపయోగ పడుతున్నాయి



ఇల్లాయిపురంలో సాయమ్మ అనే వృద్ధురాలికి అత్యవసర చికిత్స చేస్తూ..

నా ప్రాణాలు దక్కేవికావు



ఫీడర్ అంబులెన్స్ లేకపోతే నేను, నా బిడ్డ ఉండేవాళ్లం కాదు. నేను డెలివరీ సమయంలో చాలా ఇబ్బంది పడ్డాను. రాత్రి వేళ జోరువానలో సైతం టెక్నీషియన్ మా గ్రామానికి వచ్చి ఫీడర్ అంబులెన్స్ ద్వారా మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాణాపాయం తప్పింది. వైద్యులు ఎంతో మంచిగా వైద్యాన్ని అందించి నా ప్రాణాలు కాపాడారు. – గొందర లక్ష్మి, కేరాసింగి గిరి శిఖర గ్రామం, మెళియాపుట్టి మండలం

ఊపిరి పోస్తున్నాయి



ఫీడర్ అంబులెన్స్‌లు లేకపోతే గిరిశిఖర గ్రామాల్లో ఎన్నో ప్రాణాలు పోతాయి. నేను అనారోగ్య కారణంగా నడవలేని స్థితిలో ఉంటే ఫీడర్ అంబులెన్స్‌లో కరజాడ ఆస్పత్రికి తీసుకెళ్లాను. ఇలాంటి సదుపాయం కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
– సవర రవి, కొళిగాం

గొండు శంకర్ పైత్యం ▸ అమరజీవికి అవమానం

'పొట్టి శ్రీరాములు పేరు తీసేస్తాం'

- శ్రీకాకుళంలో టీడీపీ నేత గొండు శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు
- మున్సిపల్ మార్కెట్‌కు మరో పేరు పెడతామని ప్రతిపాదన
- మొన్నటికి మొన్న యాదవులను దూషించిన గొండు శంకర్ తండ్రి జగన్నాథం
- నేడు పొట్టి శ్రీరాములను అవమాన పరిచే విధంగా బహిరంగ ప్రకటన
- గొండు వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం



శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ తండ్రి జగన్నాథం ఇటీవల యాదవులను నోటికొచ్చినట్లు తిట్టారు. వారిని కించపరిచేలా మాట్లాడటమే కాకుండా ఫోన్ సంభాషణలో బెదిరించారు.

ఇప్పుడు గొండు శంకర్ మరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గుజరాతీపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములను అవమానపరిచేలా మాట్లాడారు. శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మున్సిపల్ మార్కెట్‌కు ఆ పేరు తీసేసి అంధవరపు తవిటయ్య పేరు పెడతామని, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడికి ప్రపోజల్ పెట్టామని బహిరంగ ప్రకటన చేశారు.



తండ్రీకొడుకులిద్దరు చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఇప్పటివరకు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన నాయకులు నగర అభివృద్ధికి పాటు పడ్డారు. ప్రస్తుత మంత్రి ధర్మాన ప్రసాదరావు అయితే జిల్లా కేంద్రం అభివృద్ధిలో కీలక భూమిక వహించారు. రిమ్స్ ఆస్పత్రి, ప్రధాన వంతెనలు, రోడ్లు, కలెక్టరేట్, స్టేడియం, పార్కులు, మార్కెట్, శాలిహుండం, అరసవల్లి దేవాలయం అభివృద్ధి, శ్రీకూర్మం దేవాలయం అభివృద్ధి, కళింగపట్నం బీచ్ అభివృద్ధి, డంపింగ్ యార్డ్, తాగునీరు సరఫరా... ఇలా ఎన్నో అభివృద్ధి పనులతో శ్రీకాకుళం నగరంతో పాటు నియోజకవర్గ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. జిల్లాలోనైతే వంశధార ప్రాజెక్టు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు, లిఫ్ట్ ఇరిగేషన్, మడ్డువలస రిజర్వాయర్, అంబేడ్కర్ యూనివర్సిటీ, మూలపేట పోర్టు, ఉద్దానం కిడ్నీ ఆస్పత్రి, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు తదితర అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అయ్యారు. ఆయనే కాదు గుండ అప్పలసూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవి, అంతకుముందు పనిచేసిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులంతా శ్రీకాకుళం అభివృద్ధికి కృషి చేసి, చరిత్రలో నిలిచిపోయారు. కానీ ఎన్నడూ ఇలా ప్రముఖుల పేర్లు తీసేస్తామని వివాదాస్పదంగా వ్యవహరించలేదు. కానీ ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న గొండు శంకర్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు.

తండ్రి ఒక కులాన్ని దూషించగా, గొండు శంకర్ ఏకంగా వైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టేలా, రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. నగరంలో కీలక వ్యక్తుల పేరుతో కొత్తగా ఏవైనా ఏర్పాటు చేసి వాటికి పేరు పెట్టడమో, లేదంటే వారిని గౌరవించేందుకు, స్మరించేందుకు విగ్రహాలు ఏర్పాటు చేయడమో చేయాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటి గౌరవం ఎంతో మంది ప్రముఖులకు లభించింది. బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాలను నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. అంధవరపు వరం మరణించాక ఆయన విగ్రహాన్ని ప్రధాన జంక్షన్‌లో ఏర్పాటు చేశారు. వీరితో పాటు మరికొంత ప్రముఖుల విగ్రహాలను నగరంలో ఆవిష్కరించారు. అంతేగానీ అప్పటికే ఉన్న వాటికి ప్రముఖుల పేర్లు తీసేయడం చేయలేదు. గొండు శంకర్ సమాజానికి ఏం సంకేతాలు ఇద్దామనుకుంటున్నారో గానీ రాష్ట్రం కోసం నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరుతో ఉన్న శ్రీకాకుళం మున్సిపల్ మార్కెట్‌కు ఆయన పేరు తీసేసి అంధవరపు తవిటయ్య పేరు పెడతామనడం వివాదాస్పదమైంది. ఆయన పేరు ను ఏదైనా కొత్తగా ఏర్పాటు చేసిన దానికి పెడతామ ని చెప్పాలే తప్ప రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాముల పేరును తీసేస్తామనడం, దానికో సం ఎంపీ రామ్మోహన్‌నాయుడికి ప్రతిపాదన పెట్టా మనడం వైశ్య వర్గాన్నే ఆశ్చర్యపరిచింది. వైశ్యుల ముద్దు బిడ్డగానే కాదు రాష్ట్రమంతా గొప్పగా భావించే పొట్టి శ్రీరాములు పేరు తీయాలన్న ఆలోచన రావడమే దారుణమని, ఇలాంటి వికృత చర్యలతో ఏం చేద్దామనుకుంటున్నారని వైశ్య వర్గాలే కాదు ప్రతి ఒక్కరూ తప్పు పడుతున్నారు.

సామాన్యులతో సామాన్యుల్లా..

ఎన్నికల ప్రచారాలు కొత్త పంథాలో సాగుతున్నాయి. నాయకులు సామాన్యులతో సామాన్యుల్లా కలిసిపోతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు.



అరసవల్లిలో టీడీపీ కంచుకోటను మంత్రి ధర్మాన ప్రసాదరావు బద్దలుగొట్టారు. స్థానిక టీడీపీ నాయకులంతా ధర్మాన వెంట నడిచారు.



ఎల్.ఎన్.పేట: గిరిజన గ్రామాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారాలకు చక్కటి స్పందన వస్తోంది. దబ్బపాడు గ్రామస్తులు ఇలా ఆత్మీయంగా ఆమెకు స్వాగతం పలికారు.



ఆమదాలవలస : స్పీకర్ తమ్మినేని సీతారాం వార్డులన్నీ తిరిగేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధి కృష్ణాపురంలో జనం ఇలా జేజేలు కొట్టారు.



కంచిలి: ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బూరగాం గ్రామంలో ఓ ఇంటికి వెళ్లి పార్టీ చేయబోయే కార్యక్రమాలను వివరించారు.



కాశీబుగ్గ: మంత్రి సీదిరి అప్పలరాజు మున్సిపాలిటీలోని వీధులన్నీ చుట్టేస్తున్నారు. 18వ వార్డు కళింగవీధిలో స్థానికులతో మాట్లాడారు.



సంతబొమ్మాళి: టెక్కలి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. నౌపడలో సెలూన్ షాపులో సరదాగా ఇలా కత్తెర పట్టారు.

క్లుప్తంగా

రజకుల మద్దతు వైఎస్సార్ సీపీకే



మంత్రి ధర్మాన ప్రసాదరావుతో జిల్లా రజక సంఘం నాయకులు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి జిల్లా రజక సంఘం పూర్తి మద్దతు ప్రకటిస్తోందని సంఘ అధ్యక్షుడు ఇప్పిలి సూర్యారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో ధర్మాన ప్రసాదరావు మళ్లీ మంత్రిగా గెలిపిస్తామన్నారు. ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కురిటి అప్పారావు, జిల్లా సెక్రటరీ సింగూరు నర్సింహులు, గార మండల అధ్యక్షుడు చిట్టివలస గణేష్ పాల్గొన్నారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి రక్షణగా ఈవో ఎస్.చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,37,800, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.53,807, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. కాగా, ఆలయ కేశఖండన శాలలో తలనీలాల మొక్కులకు రూ.40 టికెట్టు మాత్రమే భక్తుల నుంచి తీసుకోవాలని, అంతకుమించి క్షురకులెవరైనా అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఈఓ హెచ్చరించారు. ఈయన వెంట సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు ఉన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- యువతకు పిలుపునిచ్చిన మేఘాలయ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.ఎన్.కుమార్



సదస్సులో మాట్లాడుతున్న కె.ఎన్.కుమార్

రాజాం సిటీ: యువత ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని మేఘాలయ చీఫ్ సెక్రటరీ, మాజీ ఐఏఎస్ కె.ఎన్.కుమార్ అన్నారు. స్థానిక ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సివిల్ సర్వీసెస్‌పై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల చదువుకు ఫౌండేషన్ ద్వారా అండగా నిలుస్తున్న మదన్‌ను అభినందించారు. ఈ ప్రాంతంలో ఎంతోమంది తెలివైన యువతీయువకులు ఉన్నారని, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ మాజీ ఐజీ జీహెచ్‌పీ రాజు, మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు, ఐఆర్‌ఎస్ డిప్యూటీ కమిషనర్ డి.కల్యాణచక్రవర్తి, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, వి.జగన్నాథంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆర్మీ ఉద్యోగికి గాయాలు

జలుమూరు: పాగోడుకు చెందిన నేతింటి వైకుంఠరావు ఆదివారం తగరపువలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆర్మీలో సేవలందిస్తున్న వైకుంఠరావు విశాఖ జిల్లా పెందుర్తిలో కుటుంబంతో నివాసముంటున్నారు. స్వగ్రామం పాగోడులో ఓ ఫంక్షన్‌కు హాజరై బైక్‌పై తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 62 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భద్రత పూర్తిస్థాయిలో ఉన్న డిగ్రీ కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, యూనియన్ బ్యాంకు లాకర్లలో ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు.

చెప్పారంటే... చేస్తారంటే

స్కిల్‌హబ్‌లతో ఉపాధి



సీఎం జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోలో చెప్పినట్లు ప్రతి జిల్లాలో స్కిల్ డెవలెప్‌మెంట్ కళాశాల, నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు వల్ల యువతలో నైపుణ్యం పెరుగుతుంది. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగ్గా లభిస్తాయి. – మండపాటి చిరంజీవి, బంటుపల్లి

జగనన్న మాటే శాసనం



జగనన్న ప్రజలకు ఒక మాట ఇచ్చారంటే అది శాసనంగా భావిస్తాం. అమ్మఒడి రూ.17వేలుకు పెంచుతామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని అమలు చేసి తీరుతారనే నమ్మకం ఉంది.
– కణితి భాగ్యలక్ష్మి, హరిదాసుపురం, నందిగాం మండలం

వ్యవసాయానికి ఊతం...



రైతులకు పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతు భరోసా ఏడాదికి రూ.16వేలకు పెంచి ఇస్తామని జగనన్న చెప్పడం ఆనందం కలిగించింది. వ్యవసాయాన్ని పండగలా చేసే జగనన్నకు, వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు చాలా తేడాఉంది.
– గౌదు బాలకృష్ణ, రైతు, పాలవలస, నందిగాం మండలం

మహిళలకు చేయూత



పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత పథకం అందించారు. ఆ పథకాన్ని మళ్లీ కొనసాగించడం ద్వారా ఆర్థిక భరోసా లభిస్తుంది.
– పల్లి సావిత్రి, జగ్గయ్యపేట, సారవకోట మండలం

నమ్మకముంది..



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట ఇస్తే అమలు చేస్తారు. గతంలో పేదల సంక్షేమానికి ఏ హామీలు ఇచ్చి అమలు చేశారో ఈ సారి ఎన్నికల ముందు ఇచ్చే అన్ని హామీలు అమలు చేస్తారనే నమ్మకముం ది.
– ఎర్ల అరుద్రమ్మ, అన్నుపురం, సారవకోట మండలం

ధర్మానకు జైకొట్టిన అరసవల్లి



అరసవల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



అరసవల్లి వెలమవీధిలో సభకు హాజరైన జనం



అరసవల్లిలో భారీ జనసందోహం మధ్య ధర్మాన ఎన్నికల ప్రచారం

- వైఎస్సార్ సీపీకి మద్దతు పలికిన గుండ లక్ష్మీదేవి వర్గీయులు
- అరసవల్లిలో ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన
- భారీ సంఖ్యలో చేరికలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నిజాయితీ, నిబద్ధతనూ పట్టించుకోకుండా ఎప్పటిలాగే కేవలం డబ్బుకే అమ్ముడుపోయిన చంద్రబాబు, లోకేశ్‌లను ప్రజలు విశ్వసించరని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు దుయ్యబట్టారు. వారి ద్వంద్వ నీతి కారణంగా డబ్బులు ఇచ్చినోళ్లకే టీడీపీ టికెట్లు దక్కాయని, మిగిలిన వారికి కన్నీరే మిగిలిందన్నారు. శ్రీకాకుళం నగరంలో గుండ లక్ష్మీదేవి కోటరీగా ఉన్న అరసవల్లిలో స్థానికులంతా ఏకపక్షంగా వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చారు. అరసవల్లిలోని వెలమ వీధి, కాపువీధి, శ్రీశయనవీధి, ఎస్సీ వీధి, బ్రాహ్మణవీధుల్లో మంత్రి ధర్మాన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించగా ఇంటింటా మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. తిలకం దిద్ది అభిమానం చాటుకున్నారు. గుండ లక్ష్మీదేవి నివసిస్తున్న వెలమవీధిలో టీడీపీయేతర పార్టీలు 30 ఏళ్లుగా ఎవరూ సభ, సమావేశం నిర్వహించలేదు. తొలిసారిగా మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆ రికార్డును బద్దలు చేశారు. మూడు దశాబ్దాలుగా ప్రతి ఇంటి మీద పసుపు జెండాలు ఎగరగా.. ఆదివారం మాత్రం ధర్మానపై పూలవర్షం కురిపించి బాణసంచా కాలుస్తూ ప్రతి ఇంటిమీద వైఎస్సార్‌సీపీ జెండాలు, ప్రతి ఒక్కరి భుజంపై వైఎస్సార్‌సీపీ కండువాలు మెరిశాయి. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు గంగు సీతాపతి, వై.వి.శ్రీధర్, తెలుగు సూర్యనారాయణ, తెలుగు రమేష్, గొలివి రమణ, కరంచంద్, అప్పుయాదవ్‌ల ఆధ్వర్యంలో గుండ లక్ష్మీదేవి ప్రధాన అనుచరులు భైరి సూర్యనారాయణ, సిమ్మ సూర్యనారాయణ, బాట్న అప్పారావు (పెద్ద), బాట్న భాస్కరరావు, వడ్డి దాలిరాజు, ఉంగటి రాజు కృష్ణ, కునుకు గోవింద్, ఉంకిలి ప్రసాద్, గంట్ల కృష్ణవేణిలతో పాటు భారీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతూ మద్దతిచ్చారు.

టికెట్లు అమ్ముకున్న చంద్రబాబు, లోకేష్..

ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ 'అరసవల్లి గర్జించిందని.. ఆవేదనతో ఉందని.., నిజాయితీని అవమానించిన చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని కంకణం కట్టుకుందని చెప్పారు. రాజకీయ రంగంలో ఏ పార్టీలో ఎవరైనా కొన్ని విలువలకు గౌరవించాల్సి ఉంటుందని, విపక్ష నేత చంద్రబాబు ఎంపిక చేసిన అభ్యర్థులంతా డబ్బులిచ్చినవారేనని ఆరోపించారు. డబ్బుతో గుర్తింపు కొనుక్కున్నవారు ఇంకా డబ్బు సంపాదించే ప్రయత్నంలో ప్రజా సమస్యలు గాలికొదిలేస్తారన్నారు. ఇలాంటి వాళ్లందరూ ఎంపికై, చట్టాలు చేసే సభలకు వెళ్తే పౌర సమాజం ఏమౌతుందో ఒక్కసారిగా ఆలోచించాలని కోరారు. చంద్రబాబు టికెట్లు అమ్మితే, లోకేష్ టిక్ కొడతారన్నారు. తాము నియోజకవర్గంలో ఇరవై వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు.

సూపర్‌సిక్స్ పేరిట మోసం..

మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. చంద్రబాబుకు మేనిఫెస్టోను చిత్తు కాగితంతో సమానంగా భావిస్తారని మంత్రి ధర్మాన దుయ్యబట్టారు. మళ్లీ సూపర్ సిక్స్ అంటూ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. అచ్చెన్నాయుడులాంటి వారు ఇంకా చంద్రబాబు సీఎం అవుతారన్న భ్రమలో ఉన్నారన్నారు. ప్రజాజీవితంలో అర్థగోలు పనులు చేసిన చంద్రబాబు విశాఖను రాజధాని అంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలన్నారు. హైదరాబాద్ విషయంలో జరిగిన తప్పు మళ్లీ జరగకూడదనే మూడు రాజధానులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.4 వేల కోట్లతో మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆరుఅర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశామని, ప్రతి బడినీ అభివృద్ధి చేశామన్నారు. మీకు మేలు చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని కోరారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు మామిడి శ్రీకాంత్, డి.పి.దేవ్, సాధు వైకుంఠరావు, ఎం.వి.స్వరూప్, రౌతు శంకరరావు, చల్ల శ్రీనివాస్, అంబటి శ్రీనివాసరావు, చల్ల రవికుమార్, చౌదరి సతీష్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, పి.సుగుణా రెడ్డి, గుంట జ్యోతి, వై.గాయత్రి, ఊన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



కాశీబుగ్గ: పార్టీలో చేరిన నల్లబొడ్లూరు గ్రామస్తులతో మంత్రి సీదిరి అప్పలరాజు



సారవకోట: పార్టీలో చేరిన కొమ్మసరియాపల్లి, వడ్డినవలస గ్రామస్తులతో ఎమ్మెల్యే కృష్ణదాస్



రణస్థలం: పార్టీలో చేరిన నగరప్పాలెం గ్రామస్తులతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



శ్రీకాకుళం రూరల్: ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన దూసి ధర్మారావు, కార్యకర్తలు



రణస్థలం: పార్టీలో చేరిన మరువాడ గ్రామస్తులతో ఎమ్మెల్యే కిరణ్



శ్రీకాకుళం రూరల్: ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన సిలగాం సింగువలస గ్రామస్తులు



జలుమూరు: పార్టీలో చేరిన జోనంకి గ్రామస్తులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

రణస్థలం: కుతంత్రాలు, వెన్నుపోటు రాజకీయాల్లో ఆరితేరిన చంద్రబాబుకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నగరప్పాలెం గ్రామానికి చెందిన 200 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కెల్ల రామునాయుడు, కెల్ల భాషా, మాలచ్చి, గోవింద, పంపురెడ్డి లక్ష్మం, పిన్నింటి శ్రీను తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రణస్థలం మాజీ సర్పంచ్‌లు కరిమజ్జి భాస్కరరావు, పిన్నింటి లక్ష్మునాయుడు, నాయకులు మజ్జి రమేష్, కరిమజ్జి మహేష్, కెల్ల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మందస మండలం నల్లబొడ్లూరుకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన వారిలో గొరకల సూర్యనారాయణ, వాసు, బొడ్డు లోకనాథం, మాధవరావు, దున్న యమున తదితరులు ఉన్నారు.

శ్రీకాకుళం రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో టీడీపీకి చెందిన దూసి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి ధర్మాన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, పార్టీ నాయకులు గుమ్మా నగేష్, శిమ్మ రాజశేఖర్, టి.కామేశ్వరి, దూసి నాగేశ్వరరావు, అన్నం నాయుడు, వెంకటరమణ, కె.తిరుమల శ్రీను, తారక్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సిలగాం సింగువలసకు చెందిన 50 కుటుంబాల వారు మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో రావాడ లక్ష్మినారాయణ, రావాడ బూలోకం, కుందాల బుద్ధిస్వామి, నాగరత్నం, కర్రి అప్పయ్య, కుంచాల లోకనాథం, ఎం.రామారావు, నేతింటి పొట్టియ్య, కుందు రాజులు, పొన్నాన రామకృష్ణ, భైరి సింహాచలం, రెడ్డి నారాయణమూర్తి, నిక్కు అప్పన్న పాల్గొన్నారు.

జలుమూరు: జగనన్న పాలనతోపాటు ఎన్నికల మ్యానిఫెస్టోకు ఆకర్షితులై స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం జోనంకి గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పార్టీలో చేరిన వారిలో పుట్ట అప్పారావు, పుట్ట లక్ష్మీ, చిట్టివాడు, లీలావతి, నారాయణరావు, పుట్ట లక్ష్మీ, రాజశేఖర్, పోలా చిన్నమ్మడు, పుట్ట సుజాత తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.రమణి, మామిడి అప్పన్న, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, దామ మన్మధరావు, నాయకులు బుక్కా లక్ష్మణరావు, మండల సలహాదారు పైడి విఠలరావు, మెండ కృష్ణ పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని కొమ్మసరియాపల్లి, వడ్డినవలస గ్రామాల నుంచి 60 కుటుంబాల వారు ఆదివారం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీ చేరారు. కార్యక్రమంలో నాయకులు వరుదు దేవీప్రసాద్, గొర్లె ఢిల్లీరావు, తొగిరి సర్పంచ్ చల్లా తాతయ్య పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో హిరమండలం మండలంలోని 100 మత్స్యకార కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎం.అవలంగి, గులుమూరు, ఆకులతంపర, కల్లట, కొండరాగోలు గ్రామాలకు చెందిన మత్స్యకారులు చక్కా కోటేశ్వరరావు, కె.రామారావు, అప్పన్న, కొటారి ఆదినారాయణ, కొటారి భాస్కరరావు, కొటారి సవరయ్య, తవిటినాయుడు, కొమనాపల్లి రామారావు, దుర్గారావు, లక్ష్మినారాయణ, ఆదినారాయణ, ఎన్.గుషయ్య, సోమేశ్వరరావు, అప్పన్న తదితరులు పార్టీలో చేరారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరి, రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని కత్తివరం గ్రామానికి జనసేన పార్టీ యువకులు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కోరాడ నేతాజీ, మద్దిల శ్రీను, మద్దిల చలపతి, మల్లార్పు లింగరాజు, మల్లార్పు ప్రవీణ్, బుర్జంగి గిరి, మల్లార్పు పవన్, దుర్గాసి శివ, కోరాడ కృష్ణ, మద్దిల సుందర్ తదితరులున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, దుర్గాసి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని మరువాడ పంచాయతీలో టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారు పోరాపు సూర్యనారాయణ, అప్పన్న, సూరప్పన్న, రాముడు తదితరులకు ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ కండువాలు వేశారు. కార్యక్రమంలో మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు, కార్యకర్తలు గోవిందాసు అప్పన్న, జక్కంపూడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: మత్స్యకార నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కంచిలి: పార్టీలో చేరిన యువకులతో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్